బతుకమ్మతల్లి విగ్రహావిష్కరణ



నిజాంపేట్: బతుకమ్మ పండుగ సందర్భంగా బుధవారం ప్రగతినగర్ మాజీ ఉపసర్పంచ్ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మరికంటి భవాని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరణలో పాల్గొన్నారు. మహిళలు, బాలికలు పెద్దసంఖ్యలో పాల్గొని బతుకమ్మను ఆడిపాడి సంబురాలు ఘనంగా నిర్వహించారు.

విజయానికి ప్రతీక విజయదశమి

- దసరా పండుగ శుభాకాంక్షలు
- మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి.



సాక్షి,మేడ్చల్ జిల్లా: దసరా (విజయ దశమి) పండగ విజయానికి ప్రతీకగా నిలుస్తుందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. దసరా అంటే.. చెడును జయించి మంచిని సాధించడమే నన్నారు. విజయాన్ని చాటి చెప్పడం వంటి సంస్కృతులకు దసరా ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మహిషాసురునిపై దుర్గా మాత సాధించిన విజయానికి గుర్తుగా అమ్మవారిని కొలుస్తూ .. దేవీ శరన్నవరాత్రుల్లో వివిధ అలంకరణలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. ప్రజలందరికీ అమ్మవారి కరుణ కటాక్షాలు కలగాలని, అమ్మవారి చల్లని చూపులు అందరిపై ఉండాలని జిల్లా ప్రజలందరికీ అన్నింటా విజయం సిద్ధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. దసరా పండగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరుతూ ... జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డుపైనే వ్యర్థాల పారబోత



రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే చెత్తను వేస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు చెత్తను తొలగించి పారబోయకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా మార్పు రావడం లేదు. చెత్త వ్యర్థాల్లో పడేసిన ఆహార పదార్థాలను తినే క్రమంలో పశువులు ప్లాస్టిక్ కవర్లను సైతం తింటున్నాయి. దీంతో వాటి ప్రాణాలకు అపాయం పొంచి ఉంది. ఇప్పటికైనా అధికారులు చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మహిషాసురమర్దినిగా పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ



మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన గాజులరామారం చిత్తారమ్మ



చింతల్ సాయినగర్ కాలనీలోని మహిషాసురమర్దినిగా అమ్మవారు



మహిషాసురమర్దిని అవతారంలో సోమయ్యనగర్‌లోని నల్లపోచమ్మ

మహిషాసురమర్దినిగా దుర్గమ్మ..



చింతల్‌లో దుర్గామాత ఉత్సవ కమిటీ..

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవార్లు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆయా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతితో ముగించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహించారు.

– రంగారెడ్డినగర్



దుర్గామాత పూజల్లో డీసీసీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్



నిజాంపేట్ దుర్గామాత ఆలయంలో ..



దూలపల్లిలో మహిషాసురమర్దినిగా అమ్మవారు



నిజాంపేట్‌లో మహిషాసురమర్దినిగా అమ్మవారు

వృద్ధులను గౌరవించాలి

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



వృద్ధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అనుభవం అనేది పుస్తకాలలో దొరకదని, వృద్ధుల ద్వారా తెలుస్తుందని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ ప్రసూననగర్‌లోని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయన సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సాగర్‌రెడ్డి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచందర్, ప్రధాన కార్యదర్శి సిద్ధులుగౌడ్, దేవాలయ కమిటీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి నాగచంద్రారెడ్డి, సలహాదారులు నాగేంద్రబాబు పాల్గొన్నారు.

నాగులూరులో బతుకమ్మ వేడుకలు



దుండిగల్: నాగులూరులో బుధవారం రాత్రి బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని మహిళలందరూ ఒకే చోటకు చేరి బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో సందడి చేశారు. దీంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. రాత్రి వరకు కొనసాగిన వేడుకల్లో డీజే సాంగ్స్ మధ్య కోలాటాలతో మహిళలు నృత్యాలు చేశారు.

అధ్వానం.. బస్ షెల్టర్ల నిర్వహణ!

- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



యాచకులకు అడ్డాగా కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని బస్‌షెల్టర్

చింతల్: ఆదాయమే మాకు ముఖ్యం.. ప్రయాణికులు ఎలా నిలబడితే మాకేంటి.. ఎక్కడ నిలిచి ఉంటే మాకేంటి అన్నట్లుగా మారింది ఆర్టీసీ, జీహెచ్ఎంసీ అధికారుల పనితీరు. అభివృద్ధి పేరుతో కొన్ని బస్టాపులను తొలగించిన అధికారులు మరల వాటి స్థానంలో ఎటువంటి నూతన బస్టాప్‌లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి ఎండకు ఎండుతూ, వానలకు తడుస్తూ నరక యాతన అనుభవిస్తున్నారు. కుత్బుల్లాపూర్ లో ప్రధాన రోడ్లపైనే బస్టాప్‌ల దుస్థితి అత్యంత దారుణంగా ఉండడంతో ఇక చిన్న చిన్న బస్తీలు కాలనీలకు వెళ్లే బస్టాపుల పనితీరు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

బస్సు ఎక్కాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే..

నర్సాపూర్ రాష్ట్ర రహదారికి ఆనుకొని ఉన్న ఈ దారిలో కుత్బుల్లాపూర్‌కు అత్యంత కీలకంగా ఉన్న బస్టాప్ చింతల్ లాస్ట్ బస్టాప్. ఇక్కడ అనేక మంది నగరానికి వచ్చి వెళ్లే సిటీ బస్సులతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే బస్సులకు ఈ బస్టాపులే కీలకం. ఈ చింతల్ లాస్ట్ బస్టాప్ వద్ద సుమారు కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాలకు ఆనుకొని ఉన్న 30 నుంచి 40 బస్తీలకు చెందిన ప్రయాణికులు, జీడిమెట్ల పారిశ్రామిక వాడలతో పాటు మరికొన్ని పారిశ్రామిక వాడలకు వెళ్లే కార్మికులు, కుత్బుల్లాపూర్ శివారు ప్రాంతాలుగా ఉన్న దుండిగల్ గండి మైసమ్మ బాచుపల్లి తదితర ప్రాంతాలలో ఉన్న వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన సిబ్బందితో పాటు విద్యార్థులు అధికంగా ఈ బస్టాప్ నుంచి తమ ప్రయాణాలను కొనసాగిస్తుంటారు. అయితే ఇక్కడ హెచ్ఎంటీ ఖాళీ స్థలం, హెచ్ఎంటీ ట్రాక్టర్ పరిశ్రమల నుంచి వచ్చే వరద నీరు, సమీపంలో ఉండే చేపల దుకాణాలకు సంబంధించిన నీరు నిత్యం చింతల్ లాస్ట్ బస్టాప్ ఎదురు గుండా పారుతూనే ఉంటుంది. ఇదే బస్టాప్‌ను ఆనుకొని పలువురు ఆటోలను నిలుపుతూ ప్రయాణికులకు అసౌకర్యం కల్పిస్తున్నారు.

షెడ్డుగా ఈఎస్ఐ జీడిమెట్ల బస్టాప్!

జీడిమెట్ల ఈఎస్ఐ ఆసుపత్రి ఎదురుగా ఇటీవల రోడ్డు వెడల్పు చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న బస్టాప్‌ను తొలగించి కొంత దూరం ఏర్పాటు చేశారు. అయితే ఇందులో ఎటువంటి బల్లలు, విద్యుత్ దీపాలు లేకపోవడం, బస్టాప్ పరిసర ప్రాంతాలు సక్రమంగా లేకపోవడంతో చీడపురుగులు వచ్చే అవకాశం ఉంది. అక్కడ నిలబడేందుకు ప్రయాణికులు ఆసక్తి కనపరచడం లేదు.

బురదలోనే జీడిమెట్ల బస్టాప్..

జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ఆనుకొని ఉన్న బస్టాప్ బురదమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు బస్టాప్ ఎదురుగా నుండే వివిధ బస్సులు వెళ్లడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. గతంలో ప్రయాణికుల దినోత్సవం చూడలేక జీడిమెట్ల పోలీసు అధికారులే ఇక్కడ కొంతమేర మట్టిని తీసుకొచ్చి పోసినప్పటికీ అది ఏమాత్రం సరిపోకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మరల అదే స్థానానికి చేరిపోయింది.

యాచకులకు అడ్డాగా..

కుత్బుల్లాపూర్ విద్యుత్ కార్యాలయం సమీపంలో ఉన్న బస్టాప్ యాచకులకు అడ్డాగా మారింది. కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయాలకు బస్సు ప్రయాణం ద్వారా వచ్చే వారికి ఈ బస్టాప్ కీలకం. కానీ బస్టాప్‌లో యాచకులు తిష్ట వేసి అక్కడే బస చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఈ బస్టాప్‌ను వినియోగించడం లేదు. సిగ్నల్ వద్ద బస్సులు ఆపినప్పుడు మాత్రమే ప్రయాణికులు బస్సులను ఎక్కడం, దిగడం చేస్తున్నారు.



షెడ్డును తలపిస్తున్న జీడిమెట్ల ఈఎస్ఐ బస్‌షెల్టర్



చింతల్ లాస్ట్ బస్టాప్‌లో వరదనీరు

సహకార సంఘాల్లో ప్రాయోజిత సేవలు

దీపావళి నుంచి ప్రారంభించేందుకు సహకార శాఖ సన్నాహాలు

- మీసేవ, పన్నులు ,బిల్లుల చెల్లింపు, జనరిక్ మందులు, ఆన్‌లైన్ ఆరోగ్య, బస్సు, రైల్వే, విమాన సేవలు
- కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ పూర్తి
- సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక దృష్టి
- నగర శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 48 సహకార సంఘాలు
- వీటి ద్వారా ప్రస్తుతం రైతులకు పరికరాలు, ఎరువులు, విత్తనాల విక్రయాలు మాత్రమే

సాక్షి,మేడ్చల్ జిల్లా: సహకార సంఘాల ద్వారా ప్రజలకు ప్రాయోజిత సేవలు అందించేందుకు చర్యలు చేపట్టిన సహకార శాఖ దీపావళి నుంచి వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేపట్టింది. ప్రజలకు పలు రకాల సేవలు అందించడమే లక్ష్యంగా డీసీసీబీ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 48 సహకార సంఘాలు (పీఏసీస్/ ఎఫ్ఎస్సీఎస్) ఉండగా, 2.02 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఇందులో మేడ్చల్ జిల్లాలో తొమ్మిది సహకార సంఘాలు (పీఏసీస్/ ఎఫ్ఎస్సీఎస్) ఉండగా, 35,954 మంది సభ్యులు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 311 సహకార సంఘాల్లో ప్రాయోజిత సేవలను అందుబాటులోకి తేనున్నారు. ఇందులో భాగంగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 48 సంఘాల ద్వారా ప్రాయోజిత సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మేడ్చల్ జిల్లాలో ఘట్కేసర్, కీసర, శామీర్‌పేట , అల్వాల్, పూడూరు, మేడ్చల్, డబుల్ పూర, బౌరం



పేట, దూలపల్లి సహకార సంఘాల ద్వారా ప్రజలకు దీపావళి నుంచి ప్రాయోజిత సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు జిల్లా సహకార శాఖ అసరమైన చర్యలను తీసుకుంటోంది.

ముగిసిన శిక్షణ

ప్రాయోజిత సేవలపై సహకార సంఘాల్లో పని చేస్తున్న సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. 54 సర్వీసుల ద్వారా ప్రజలకు 340 బహుళ ఆర్థిక సేవలను అందుబాటులోకి తేనున్నారు. ప్రస్తుతం సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన పరికరాలు, ఎరువులు, విత్తనాలు మాత్రమే అందుతున్నాయి. రైతులతోపాటు ప్రజలకు మరింత చేరువయ్యేలా బహుళ ఆర్థిక సేవలను అందించేందుకు సహకార సంఘాలకు లాగిన్ ఇచ్చారు.

అందించే సేవలు ఇవీ..

ఆదాయ పన్ను, ఇంటి పన్ను, విద్యుత్ బిల్లుల చెల్లింపు, రిజిస్ట్రేషన్లు, నగదు తీసుకునే విధంగా మినీ ఏటీఎం, మీసేవ, ఇతర అన్ని రకాల లావాదేవీలు సహకార సంఘాల్లోనే జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, నిత్యావసర సరకులు, దుస్తులు, అవసరమైన ప్రతి వస్తువు కొనుగోలు చేసేందుకు సంఘంలోనే ఆన్‌లైన్ నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. జనరిక్ మందులను అందుబాటులో ఉంచడం, ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేట్ వైద్యుల ద్వారా ఆన్‌లైన్‌లో సలహాలు, సూచనలు, రక్త నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణలు అందేలా చూస్తారు. విమాన, రైల్వే, బస్సు రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. లావాదేవీలు నిర్వహించేందుకు సహకార సంఘం నుంచి కరెంట్ ఖాతాలను తెరిచారు.

మెరుగైన టెక్నాలజీ..

సేవలు పెంచితే సహకార సంఘాలకు ప్రస్తుతమున్న సాంకేతిక పరిజ్ఞానం సరిపోయేలా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం కోర్ బ్యాంకింగ్ ద్వారా రోజువారీ ఆన్‌లైన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మోడెం ద్వారా ఇవి జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని సంఘాల్లో కూడా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకుచ్చేందుకు తగిన విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు.

దశల వారీగా అమలుకు చర్యలు

సహకార సంఘాల్లో దీపావళి నుంచి అన్ని రకాల ఆన్‌లైన్ సేవలను ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. మేడ్చల్ జిల్లాలో తొమ్మిది సహకార సంఘాల ద్వారా ప్రజలకు ప్రాయోజిత సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇటీవల సిబ్బందికి ఇచ్చిన శిక్షణలో ప్రజలకు అందించాల్సిన సేవలపై అవగాహన కల్పించాం. శిక్షణతో పాటు సందేహాలు నివృత్తి చేశాం. సేవలు అందుబాటులోకి వస్తే వ్యాపారాలు పెరిగి సంఘాలు బలోపేతం అవుతాయి. ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– వెంకట్‌రెడ్డి, జిల్లా సహకారశాఖాధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా